అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: కాలనీల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని శక్తినగర్ కాలనీలో రూ. 38 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాలనీలలో సమస్యలను గుర్తించి ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రామారావు, అశోక్‌గౌడ్, అజయ్‌యాదవ్, ఎండీ.ఖాదర్, వెంకట్‌రెడ్డి, కిష్టయ్య, రాంరెడ్డి, మాలింగం, హర్షవర్ధన్, రాంరెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

వనస్థలిపురం: వనస్థలిపురం ఎన్జీవోస్‌కాలనీలోని శ్రీ గణేష్ దేవాలయంలో సోమవారం సంకటహార చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సేవా సమితి అధ్యక్షులు కే.ధర్మారావుగుప్త, ప్రధాన కార్యదర్శి పీవీకే.సోమయాజులు పేర్కొన్నారు. సోమవారం శ్రీ లక్ష్మీ గణపతికి అభిషేకాలు, అర్చనలు, గణపతి హోమం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 15 నుంచి 23 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సామూహిక శ్రీ లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణం, 23న మాస శివరాత్రి సందర్భంగా ఉదయం శ్రీ ఉమామహేశ్వరస్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, చండీ హోమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న వలంటీర్లు

సైదాబాద్: శాంతి స్థాపనకోసం అహ్మదీయ ముస్లిం సముదాయం కృషి చేస్తుందని హైదరాబాద్ అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ మహిళా విభాగం అధ్యక్షురాలు మర్యమ్ అజీమ్ పేర్కొన్నారు. ఆదివారం సైదాబాద్‌లోని కమ్యూనిటీ మసీద్‌లో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో కమ్యూనిటీ వలంటీర్లు పెద్దసంఖ్యలో పాల్గొని రక్తదానం చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రక్తదానం వంటి మానవతా మరియు శాంతి ప్రోత్సాహక కార్యకలాపాలను తమ సముదాయం తరచూ నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అయేషా అహ్మద్, డాక్టర్ భూపేందర్ కౌర్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం ప్రతినిధులు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధిలోని శ్రీ వెంకటరమణ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవీంద్రనాథ్, ఉపాధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాములు నాయక్, సంయుక్త కార్యదర్శిగా జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా రాములు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కరుణాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నవీన్‌కుమార్, వెంకటేష్, మల్లేష్, సతీష్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కిషన్‌గౌడ్, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

సన్మానం



యాదగిరిని సన్మానిస్తున్న నేతలు

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయ ట్రస్ట్ బోర్డు నూతన ధర్మకర్తగా పదవీబాధ్యతలు చేపట్టిన తీగుళ్ల యాదగిరిని బీఆర్ఎస్ నేతలు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వేశ్వర్‌రావు, వీరారెడ్డి, కమలాకర్, నవీన్, వెంకటేష్, జోగు కృష్ణ, మల్లేష్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



మన్సూరాబాద్: ఆపోలో ఫార్మసి ఆధ్వర్యంలో రాక్‌టౌన్‌కాలనీ కమ్యూనిటీహాల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో పాల్గొన్న వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి, వైద్యులు అఖిల్, రామకృష్ణయ్య, రఘుపాటిల్ పాల్గొన్నారు.

వానొస్తే ఇంటికే!

- శిథిలావస్థలో కర్మన్‌ఘాట్ ప్రాథమిక పాఠశాల భవనం
- భయంగుప్పిట్లో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



వర్షం రావడంతో తరగతి గదిలోకి చేరిన నీరు(ఫైల్)

చంపాపేట: శిథిలావస్థలకు చేరిన ప్రభుత్వ పాఠశాలలతో విద్యార్థులు భయం గుప్పిట్లో పాఠాలు వినాల్సి వస్తోంది. ప్రభుత్వాలు..ప్రజాప్రతినిధులు మారుతున్నా వారిచ్చిన హామీలన్నీ నీటిమీద రాతల్లా మారుతున్నాయే తప్ప పాఠశాల భవన పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టకపోవటంతో ఎప్పుడు కూలు తాయోనని భయాందోళనకు గురవుతున్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ క్రాంతి యువజన సంఘ కార్యాలయ ఆవరణలో నాలుగు దశాబ్దాల క్రితం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కోసం జెడ్పీ నిధులతో నాలుగు తరగతి గదులతో భవన నిర్మాణం చేపట్టారు.

నామమాత్రంగా మరమ్మతు

పాఠశాల భవనం నిర్మించనప్పటి నుంచి ఇప్పటి వరకు భవన మరమ్మతులు, నిర్వహణ కోసం ప్రభుత్వం మన బస్తీ..మన బడి పేరున నామమాత్రం నిధులు మంజూరు చేసి పాఠశాల గోడలకు రంగులు, తరగతి గదిలో పెచ్చులూడిన స్లాబ్ మరమ్మతు మాత్రం చేసి చేతులు దులుపుకున్నారు. గత ఎనిమిది సంవత్సరాల క్రితం పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాల సమీపంలోనే మరో భవన నిర్మాణం చేపట్టి ఆ భవనంలో 1–2 తరగతి వరకు విద్యాభోధన సాగిస్తుండగా.. శిథిలావస్థలో ఉన్న పురాతన భవనంలో 3–5 తరగతి విద్యార్థులకు బోధన సాగిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన భవనంతో ఏ క్షణాన ప్రమాదం సంభవిస్తుందోనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాలన్నీ దుర్గంధమే..

పాఠశాల పరిసరాలలో స్థానిక కాలనీవాసులు, శానిటేషన్ సిబ్బంది, వారాంతపు కూరగాయల చెత్తను డంపింగ్ చేయటంతో ఆ ప్రాంతం దోమలు, ఈగలు, పందులకు ఆవాసాలుగా మారాయి. అది చాలదన్నట్లు పాఠశాల పరిసరాలు శానిటేషన్ నిర్వహణ లేకపోవటంతో తమ పిల్లలు ముక్కుపుటలు అదిరే దుర్గంధం, దోమలు, ఈగలు, పందుల స్వైర విహారం నడుమే విద్యాభ్యాసం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి నూతన తరగతి గదులు ఏర్పాటు చేయాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన కర్మన్‌ఘాట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల



విరిగిన ఫ్యాన్

ఉన్నతాధికారులు స్పందించాలి..



దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పాఠశాల భవనానికి కొంత మేర మరమ్మతు చేపట్టినప్పటికీ పురాతన భవనం కావటంతో శిథిలావస్థకు చేరింది. లోతట్టు ప్రాంతంలో పాఠశాల భవనం ఉండటంతో చినుకు పడ్డా తరగతి గదుల్లోకి వరద నీరు చేరుతుంది. వారం పాటు గోడల నుంచి నీరు కారుతుంది. చినుకు పడితే లాంగ్ బెల్లే. ఉన్నతాధికారులు స్పందించి నూతన భవన నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలి.

యూబీ ఆనంద్‌నాయుడు, చంపాపేట

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దు



కార్మికులకు రిక్షాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

చాదర్‌ఘాట్: పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. ఆదివారం ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లోని దివ్యాంగుల పార్కులో పారిశుద్ధ్య కార్మికులకు ఆయన చెత్త రిక్షాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. మలక్‌పేట నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాల పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికులు పాత్ర ఎనలేనిదన్నారు.

105 దేవాలయాలకు చెక్కుల అందజేత

చాదర్‌ఘాట్: బోనాల నేపథ్యంలో మలక్‌పేట నియోజకవర్గంలో ఉన్న 105 దేవాలయాలకు రూ. 32. 61లక్షల చెక్కులు పంపిణీ చేసినట్లు హైదరాబాద్ డివిజన్–1 ఇన్‌స్పెక్టర్ ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు.

ఉత్సాహంగా గోరింటాకు వేడుకలు



చైతన్యపురి: ఆషాఢ మాసం సందర్భంగా విశ్వ హిందూ పరిషత్–మాతృశక్తి విభాగం ఆధ్వర్యంలో ఆదివారం గోరింటాకు ఉత్సవం నిర్వహించారు. హిందూ సంప్రదాయాలు, ఆచారాలను భావితరాలకు తెలియజేయాలని దిల్‌సుఖ్‌నగర్ గౌతమ్‌నగర్ కాలనీలో గోరింటాకు కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాలక్ష్మి, జ్యోతి, వాణి, దేవిక, మహేశ్వరి, యాదవిజయ, హేమలత, భాగ్యలక్ష్మి, సంధ్య, లక్ష్మి, మనోహరి పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై దాడి హేయమైన చర్య

కాచిగూడ: మున్నూరుకాపు నేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన అనుచరులతో దాడి చేయించడం పట్ల తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు, ప్రధానకార్యదర్శి మంగళారపు లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు మణికొండ రమేష్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడుతూ... గతంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, కవిత ఎన్నోసార్లు తెలంగాణ యాస భాషలో పలువురిని రకరకాల మాటలతో తిట్టారన్నారు. అదే యాసలో తీన్మార్ మల్లన్న అన్న మాటకు దాడి చేయించడం సమంజసం కాదని విమర్శించారు. మల్లన్న పొరపాటున మాట్లాడి ఉంటే అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాని అతడి కార్యాలయంపై దాడి చేసి ఫర్నిచర్ ధ్వంసం చేయడం క్రిమినల్ చర్యలో భాగమని వారు పేర్కొన్నారు. దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇది కూడా బీసీలను భయపెట్టేయడం, రాజకీయంగా అణగదొక్కడంలో భాగమేనని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మహాసభ నేతలు ఎనుగుల మాణిక్ ప్రభు, కొరివి వేణుగోపాల్, జి.సత్యనారాయణ, బిల్లకంటి రవికాంత్ పాల్గొన్నారు.

మంకాలమ్మ బోనాల పాట ఆవిష్కరణ



ఒగ్గు రాముతో సీడీని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

కాచిగూడ: ఆషాఢమాస బోనాల పండుగ సందర్భంగా అంబర్‌పేట ప్రాంతానికి చెందిన ఒగ్గు రాము రాసిన అంబర్‌పేట మంకాలమ్మ బోనాల పాటను ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. యువత కలల పట్ల ఆసక్తిని పెంచుకుని ఇలాంటి ఆధ్యాత్మిక భావనతో కూడిన పాటని రాసుకుని పాడిన ఒగ్గు రాముని ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి అభినందించారు. సనాతన ధర్మంలో ఉన్న ఒగ్గు కథలను ఇప్పటికీ పరిరక్షిస్తూ ఇలాంటి భక్తి పాటలను రాయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు డాక్టర్ ఎస్.గౌతం రామ్, లంకల దీపక్‌రెడ్డి, ఎడెల్లి అజయ్‌కుమార్, సి.నందకిషోర్ యాదవ్, పి.నాగరాజు చారి, ఏడెల్లి బాలు, ఎ.యశ్వంత్, సునీల్, కోడూరు శ్రీశైలం, రవి, రమేష్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హర్షం



మహేష్ కుమార్‌గౌడ్‌తో వీరభోగ వసంతరాయిలు

మన్సూరాబాద్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర కేబినేట్ నిర్ణయం తీసుకోవటంపై బీసీ ఫెడరేషన్ కులాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వీరభోగ వసంతరాయులు ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టసభల్లో కుమ్మరులకు ఇప్పటి వరకు అవకాశం లభించలేదని వివరించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్‌గా కుమ్మరులకు అవకాశం కల్పించాలని కోరినట్లు పేర్కొన్నారు.

నవయుగ యూత్ అధ్యక్షుడిగా కాశీనాథ్‌రెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడ నవయుగ యూత్ అసోసియేషన్ సమావేశాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా అర్కల కాశీనాథ్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధికి కృషి చేయడంతో పాటు రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని కాశీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో స్థానిక నాయకులు పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, బొక్క రాజేందర్‌రెడ్డి, జిల్లెల దామోదర్ రెడ్డి, అర్కల కామేశ్‌రెడ్డి, జంగయ్య యాదవ్, సిద్దాల కృష్ణ, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శాకంబరిగా పోచమ్మతల్లి



మన్సూరాబాద్: మన్సూరాబాద్‌లోని పోచమ్మదేవాలయంలోని అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలతో పోచమ్మతల్లిని అలంకరించారు. ఈ నెల 20న బోనాల ఉత్సవాల నేపథ్యంలో శుక్రవారం దుర్గాదేవి ఆలయం నుంచి పట్టువస్త్రాల సమర్పణ ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నేతలు పోచబోయిన గణేష్‌యాదవ్, కొప్పుల ఉపేందర్‌రెడ్డి, నాంపల్లి శంకరయ్య, భక్తులు పాల్గొన్నారు.

ఆర్డినెన్స్ తీసుకొస్తామని ప్రకటించడం హర్షణీయం



కవాడిగూడ: బీసీలకు 12 శాతం రిజర్వేషన్లను అమలు చేయడానికి మంత్రివర్గంలో ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొస్తామని ప్రకటించడం హర్షణీయమని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం వారు కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం తెలంగాణ బీసీ–ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బాగయ్య, సంఘం యువజన విభాగం అధ్యక్షుడు అంబటి సుధాకర్ గంగపుత్రతో కలిసి విలేకరుల సమావేశంలో శ్రీహరి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యా, ఉద్యోగ, రాజకీయ, స్థానికసంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లలో గంగపుత్రులకు స్థానిక సంస్థల ఎన్నికలలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. రిజర్వేషన్ల అమలుపై భవిష్యత్‌లో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు.

మన్సూరాబాద్ రోడ్డును విస్తరించాలి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: రాబోయే తరాల అవసరాల దృష్ట్యా మన్సూరాబాద్ రోడ్డును (బిగ్‌బజార్ చౌరస్తా నుంచి సుష్మా చౌరస్తా వరకు) విస్తరించాల్సిన అవసరం ఉందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. డివిజన్ పరిధి కాస్మోపాలిటన్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్కును ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలో ఐదు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు నాణ్యతతో చెక్కు చెదరకుండా ఉన్నాయని, నేడు ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు కొన్ని రోజులకే పాడైపోతున్నాయన్నారు. కాలనీలో ఉన్న విశాలమైన స్థలంలో కమ్యూనిటీహాల్, ఆటస్థలం ఏర్పాటుకు గతంలోనే ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్ర లక్ష్మినర్సింహా, శ్రీకాంత్, గంజి సత్తయ్య, శ్రీనివాస్, భాస్కర్, గోపాల్, రమేష్, జ్ఞానేశ్వర్, నాయకులు జగదీష్‌యాదవ్, నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కుమ్మర్ల తొలి బోనాల ఉత్సవం



బోనాల ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: మన్సూరాబాద్ గ్రామ కుమ్మర్ల తొలి బోనాల ఉత్సవాలు ఆదివారం మన్సూరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, ముద్దగౌని లక్ష్మిప్రసన్న బీఆర్ఎస్ సీనియర్ నేత మామిడి రాంచందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మన్సూరాబాద్ గ్రామంలోని కుమ్మరి సంక్షేమసంఘం భవనం నుంచి పోచమ్మ దేవాలయం వరకు పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాలతో కుమ్మరులు బోనాలతో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నాంపల్లి హనుమంతు, ఉత్సవ కమిటీ చైర్మన్ నాంపల్లి మల్లేష్, నాంపల్లి శంకరయ్య, బాలరాజు, వెంకటేష్, నాగేష్, గణేష్, నర్సింహ్మా, మహేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బస్తీ వాసులు

నాగోలు: మోహన్‌నగర్ బస్తీలోని సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మోహన్‌నగర్‌లో బస్తీలో పర్యటించగా వివిధ సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బోనాల సందర్భంగా గుంతలు మారిన రోడ్లకు మరమ్మతు చేయించాలని కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్ సింగ్, రాజ్‌కుమార్ సింగ్, చుక్కయ్య, గోవర్ధన్, జంగయ్య, దినేష్, సుబ్బారావు, మంచి రాజేష్, రామకృష్ణ, రాకేష్, వెంకట్ రెడ్డి, గట్టు మహేష్ కుమార్ పాల్గొన్నారు.

జోరుగా బోనాల ఉత్సవాలు



పూజలు చేస్తున్న ఎస్‌జీఎస్, హమాలీ సంఘం నాయకులు

చాదర్‌ఘాట్: శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పుల చప్పులతో మలక్‌పేట గంజిలో ఆదివారం బోనాల ఉత్సవాలు జోరుగా జరిగాయి. అఖిల హైదరాబాద్ హమాలీ సంఘం అధ్యక్షుడు .సురేష్, ప్రధాన కార్యదర్శి శేఖర్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాలతో పాటు నృత్యాలు భక్తులను ఆకర్షించాయి. అమ్మవారి పూజలకు మార్కెట్ ఎస్‌జీఎస్ చిలుక నర్సింహారెడ్డి, సిబ్బంది హమాలీ సంఘం నాయకులు వ్యాపారులు చాట కార్మికులు బోనాలతో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.



అమ్మవార్ల వేషధారణలో నృత్యాలు

బోనాల నిర్వహణకు ఏర్పాట్లు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్‌లో వచ్చేవారం బోనాలు ఉండటంతో ఆదివారం కోట మైసమ్మ ఆలయం వద్ద నిర్వాహకులు సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. కోట మైసమ్మ, పోచమ్మ దేవాలయాలకు రంగులు అద్దడం, సౌండ్ బాక్సులు, విద్యుద్దీపాలు అలంకరించడం, భక్తులకు కల్పించే వసతుల గురించి మాట్లాడారు. స్థానికులతో పాటు పోలీసులతో కలిసి బందోబస్తు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆలయాల వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు భీమిడి జంగారెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, పి.సుదర్శన్‌రెడ్డి, సామ సంజీవరెడ్డి, గుర్రం మల్లారెడ్డి, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, బల్వంత్, ప్రభాకర్, లోకం, మహిపాల్, గౌరసాయి, సంతోష్, జగదీశ్, దర్శన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జూ పార్కులో వన మహోత్సవం



వన మహోత్సవంలో డాక్టర్ సువర్ణ

చార్మినార్: వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర పీసీసీఎఫ్ (హెచ్‌ఓఎఫ్‌ఎఫ్), డాక్టర్ సి. సువర్ణ, పీసీసీసఎఫ్ (వైల్డ్ లైఫ్) ఏలు సింగ్ మేరు, ఇతర అటవీ అధికారులు, జూ పార్కుల డైరెక్టర్‌తో కలిసి నెహ్రూ జూలాజికల్ పార్క్ ను ఆదివారం సందర్శించారు. వన మహోత్స వం–2025లో భాగంగా వారంతా కలిసి జూ పార్కులో మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సరీసృపాల నివాస ప్రాంతం సమీపంలో ఫికస్, ఇతర ఫలాలను ఇచ్చే చెట్ల మొక్కులు, నీడనిచ్చే చెట్ల మొక్కలను నాటడం ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ సువర్ణ జెండా ఊపి, చిన్న పిల్లల ఆవరణలో ప్రజా ప్రదర్శన కోసం ఒక జత 'సర్వల్ క్యాట్'ను విడుదల చేశారు. పీసీసీఎఫ్ పునరుద్ధరించిన శిలాజ ఉద్యానవనాన్ని కూడా ప్రారంభించారు. ఇది తెలంగాణ మ్యాప్ నమూనాలో నాటిన వివిధ రకాల మొక్కల జాతుల కలయిక. తెలంగాణ జూ పార్క్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ ఎస్. హిరేమత్, మాజీ డైరెక్టర్ అక్బర్ (రిటైర్డ్) నెహ్రూ జూపార్క్ వెటర్నరీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఏ. హకీం పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



పనులను పరిశీలిస్తున్న నాచారం కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం సాయినగర్ కాలనీలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని నాచారం కార్పొరేటర్ శాంతి అన్నారు. ఆదవారం నాచారం సాయినగర్ కాలనీలో ఆమె పర్యటించిన ఆమె సొంత ఖర్చులతో 20 మీటర్ల ఆర్సీబీ స్లాబ్‌ను తొలగింపజేశారు. త్వరలోనే డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడతామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. స్థానిక నేతలు కట్ట బుచ్చన్నగౌడ్, చంద్రశేఖర్, స్వామి, రూప తదితరులున్నారు.